ప్రజాశక్తి

సోమవారం 17 జూన్ 2024 | 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



మాట్లాడుతున్న మంత్రి స్వామి

'వెలిగొండ'ను పూర్తి చేస్తాం..

- మార్కాపురం జిల్లాని చేస్తాం..
- కందుకూరు, అద్దంకిని 'ప్రకాశం'లో కలుపుతాం
- తూర్పునాయుడుపాలెం సభలో మంత్రి డాక్టర్ స్వామి



మంత్రి స్వామి, సత్యను గజమాలతో సత్కరిస్తున్న టిడిపి నాయకులు, అభిమానులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

నారా చంద్రబాబునాయుడు అప్పట్లో ముఖ్యమంత్రిగా వెలిగొండ ప్రాజెక్టును శంకు స్థాపన చేశారని, అదే ముఖ్యమంత్రిగా చంద్ర బాబు నాయుడు ఇప్పుడు ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసి.. తొలిసారిగా స్వామి ఆదివారం జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా టంగుటూరు మండలం తూర్పునాయుడు పాలెం గ్రామంలో అభినందన సభ నిర్వహిం చారు. ఈ అభినందన సభకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహన కార్యదర్శి దామచర్ల సత్య అధ్యక్షత వహించి ప్రసంగించారు. ముఖ్యఅతిథిగా మంత్రి వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ మార్కాపురాన్ని జిల్లాగా చేసి.. కందుకూరు, అద్దంకిని ప్రకాశం జిల్లాలో కలిపే బాధ్యత తీసుకుంటామన్నారు. సాగర్ జలాలు జిల్లాలోకి పూర్తిస్థాయిలో వచ్చే విధంగా పనిచేస్తామన్నారు. జగన్మోహన్‌రెడ్డి చేసిన అరాచక పాలనకు జనం ఇచ్చిన తీర్పును పరి గణలోకి తీసుకొని పనిచేస్తామన్నారు. ఎప్పు డూ కార్యకర్తలకు అండగా నిలబడి ▶ 2లో

యంత్రాంగం ప్రక్షాళన దిశగా..

- ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ అధికారులు
- సిఫార్సుల కోసం ప్రయత్నాలు..
- బాధిత ఉద్యోగులకు ప్రాధాన్యత
- కలెక్టర్, ఎస్పీల బదిలీల తర్వాతే జిల్లా, మండలస్థాయి బదిలీలపై దృష్టి



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

అధికార యంత్రాంగంలో సమూల మార్పులు చేసేందుకు పాలకపక్షం ఆలోచన చేస్తోంది. ఇప్పుడున్న యంత్రాంగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు ఆలోచిస్తున్నారు. దాదాపుగా అందరి స్థానాలు తారుమారు కాక తప్పవు. ఎన్నికల కోసం ఇతర జిల్లాల నుంచి అధికారులను వేశారు. వారంతా రేపో, మాపో బదిలీలపై వెళ్లక తప్పదు. అంతకుముందు తెలుగుదేశం ప్రభుత్వంలో పనిచేసిన అధికారులను, క్షేత్రస్థాయిలో అంటే మండలాల్లో ఉన్న అధికారులను తిరిగి ఇక్కడకు తెప్పించుకునేందుకు ససేమిరా అంటున్నారు. వైసిపికి అంటకాగిన పోలీసు, రెవెన్యూతో పాటు ఇతర శాఖల అధికారులను అందరినీ ఇక్కడ నుంచి సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారు. ఎవరినీ వదిలిపెట్టేది లేదంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వైసిపి ప్రజాప్రతినిధులు చెప్పినట్లు తలూపి ఇష్టానుసారంగా పనిచేసిన వారందరినీ దూరంగా ఉంచాలనే ఆలోచనలో ఉన్నారు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన మరు క్షణమే ఈ వ్యూహం నడుస్తోంది. ముందు అధి కారుల సంగతి చూడాలంటున్నారు. కలెక్టర్, ఎస్పీల బదిలీలు త్వరలో జరిగే అవకాశం ఉంది. వీరిద్దరినీ పంపించాలనే ఆలోచనలోనే ఉన్నారు. వీరిద్దరినీ ఉంచాలా? లేదా? అన్నది సిఎం చంద్రబాబు ఆలోచనతో ముడిపడి ఉంటుంది. బదిలీలు తప్పవంటున్నారు. వాళ్లు కూడా అందుకు సిద్ధంగానే ఉన్నారు. ఎటూ ఎన్నికల తర్వాత కొత్త యంత్రాంగం వస్తుంది. అందులో ముందుగా బదిలీలు జరిగేదే కలెక్టర్, ఎస్పీలతోనే ఉంటాయి. జిల్లాకు చెందిన మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా వీరాం జనేయస్వామి ఇద్దరూ బదిలీ లపై దృష్టి సారించనున్నారు. ఇప్పటికే జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు వెళ్లి వాళ్లను కలుస్తున్నారు. ఇప్పటివరకూ విఆర్‌లోనూ, ఇతర ప్రాధాన్యత లేని పోస్టుల్లో ఉన్న ఉద్యోగులు అనేక మంది వెళ్లి మంత్రులు, ఎమ్మెల్యేలను కలుస్తున్నారు. తమకు పోస్టింగుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నారు. స్థానిక తెలుగుదేశం నేతలను సిఫార్సులు చేయించుకుంటున్నారు. ముందు గానే వెళ్లి మాట్లాడుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో వైసిపి నేతల వల్ల పడ్డ ఇబ్బం దులను చెప్పుకుంటున్నారు. జిల్లా కేంద్రానికి దూరంగా పోస్టింగుల్లో పడేయబడ్డ ఉద్యోగులు ఇప్పుడు వారికి అవకాశం వచ్చినందున నేతలను కలుస్తున్నారు. అప్పటి ఎమ్మెల్యేలు, మంత్రుల మాట వినకపోవడంతో పాటు తెలుగుదేశం ముద్ర పడ్డ వారందరినీ ప్రాధాన్యతల్లేని పోస్టుల్లో ▶ 2లో

నిలిచిపోయిన 'ధాన్యం' చెల్లింపులు

- రబీ ధాన్యం నగదు రూ.10 కోట్ల కోసం రైతుల ఎదురుచూపులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో రబీ సీజన్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యంకు సంబంధించిన నగదు బకాయిలు రూ.10 కోట్ల మేరకు నిలిచిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగి రబీ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఇతర జిల్లాల రైతులకు కొంత మేర నగదు చెల్లింపులు జరిగాయి. కానీ బాపట్ల జిల్లా రైతులకు రావలసిన నగదు విడుదల కాకపోవడంతో రైతులు ఈ ఖరీఫ్‌లో తమ వ్యవసాయ పనులు చేపట్టేందుకు తమ ధాన్యం నగదు కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో రబీలో 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాలని నిర్ధేశించినప్పటికీ ఆచరణలో 4,879 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 738 మంది రైతుల నుంచి కొన్నారు. ఈ కొనుగోళ్లకు సంబంధించి రూ.10.74 కోట్ల నగదు రావలసి ఉంది.



ధాన్యం అమ్మకాలు చేస్తున్న రైతులు (ఫైల్)

గడిచిన వ్యవసాయ సీజన్‌ను పరిశీలిస్తే.. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలకు ఆచరణలో జరిగిన దానికి ఏమాత్రం పొంతన లేదని వెల్లడవుతుంది. గత ఖరీఫ్‌లో వరి పంట చేతికి అంది వచ్చే సమయంలో డిసెంబర్‌లో సంభవించిన తుపాను కారణంగా రైతులు పంటలు నష్టపోయారు. పంట నష్టాన్ని పరిశీలించేందుకు జిల్లాకు వచ్చిన ముఖ్య మంత్రి జగన్ తుపాను కారణంగా నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారు. కానీ పంట నష్టపరిహారం చెల్లిం పులు అరకొరగా జరిగాయి. నేటికీ కొంత మంది రైతులకు నష్టపరిహారం అందిన పరిస్థితి లేదు. గడచిన మూడేళ్లుగా ఖరీఫ్ సీజన్‌లో వరి పంట చేతికి వచ్చే సమయం లోనే తుపానులు సంభవించి భారీ వర్షాల కారణంగా రైతులు నష్టపోతూ వచ్చారు. ప్రతి ఏటా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని లక్ష్యాలను నిర్ధేశించడమే తప్ప ఆచరణలో ఈ మేరకు కొనుగోళ్లు జరిగిన పరిస్థితి లేదు. జిల్లాలో రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం అమ్మకాలు జరిపే విషయంలో రైతులు అనేక ఇబ్బందులు పడుతూ వచ్చారు. ధాన్యం నగదు చెల్లింపుల్లో విపరీత జాప్యం జరుగుతూ వచ్చింది. రవాణా ఇబ్బందులు ఉన్నాయి. ధాన్యం అమ్మిన తరువాత రైతులు ఆర్‌బికె, బ్యాంకుల చుట్టూ తిరగడం పరిపాటి అయ్యింది. గడిచిన మూడేళ్లలో ఏనాడూ కూడా రాష్ట్రప్రభుత్వం 21 రోజుల్లోనే నగదు ఇవ్వడం అనేది జరగలేదు. ఈ కారణంగా రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తమ ధాన్యం అమ్మకాలు జరుపుతూ వచ్చారు.

దీంతో జిల్లాలో 153 ఆర్‌బికెల ద్వారా ఖరీఫ్ ధాన్యం కొనుగోలు లక్ష్యం 78 వేల మెట్రిక్ టన్నులు కాగా 68 ఆర్‌బికెల ద్వారా సుమారు 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొను గోలు చేశారు. అయితే వీటికి సంబం ధించి రూ.36 కోట్ల నగదు బకాయిలు మూడు నెలల పాటు నిలచిపోయాయి. రైతుభరోసా కేంద్రాల ధాన్యం కొనుగోళ్లు ఏటేటా తగ్గిపోతున్నాయి. ప్రభుత్వం నిర్ధేశిస్తున్న లక్ష్యం కూడా తగ్గిపోతుంది. ఇలా నిర్ధేశించుకున్న లక్ష్యంలో సగం కూడా అమలుకు నోచుకోవడం లేదు.

గత రబీలో 98 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాలని లక్ష్యం పెట్టారు. కానీ 49 వేల మెట్రిక్ టన్నులు కొన్నారు. ఈ రబీలో సాగు నీరు లేక, వర్షాలు కురవక జిల్లాలో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 50,348 ఎకరాలు కాగా 15,998 ఎకరాల్లో మాత్రమే వరిసాగు జరిగింది. ఈ నేపథ్యంలో రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లు ఏప్రిల్ రెండోవారం నుంచి జరపాలని నిర్ణయించారు. ధాన్యం కొనుగోలు లక్ష్యం 10 వేల మెట్రిక్ టన్నులుగా ▶ 2లో

వాడరేవులో ఇద్దరు గల్లంతు

- ఒకరిని కాపాడిన మెరైన్ పోలీసులు
- విహార యాత్రకు వచ్చిన ఇంజనీరింగ్ విద్యార్థులు
- యువకుడి కోసం గాలింపు చర్యలు



కార్తీక్ (ఫైల్)



చికిత్స పొందుతున్న కేథారేశ్వరరావు

ప్రజాశక్తి-చీరాల

సెలవు రోజు కావడంతో స్నేహితులతో సరదాగా తీరంలో గడిపేందుకు విహారయాత్ర లో భాగంగా వాడరేవుకు వచ్చిన ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు గల్లంతయ్యారు. ఒకరిని మెరైన్ పోలీసులు స్థానికుల సాయంతో కాపాడగా.. మరో యువకుడి కోసం గాలిస్తు న్నారు. ఈ ఘటన ఆదివారం చీరాల మండలం, వాడరేవు సముద్ర తీరంలో జరిగింది.

ఏలూరు జిల్లా, నూజివీడుకు చెందిన 11 మంది ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు వాడరేవు సముద్రతీరంలో స్నేహితులతో సరదాగా గడిపేందుకు ఆదివారం ఉదయం వచ్చారు. అయితే తీరానికి చేరుకోగానే వారిలో క్రోసూరి కార్తీక్(20) విద్యార్థి ముందుగా ఈత కొట్టేందుకు సముద్రంలో దిగాడు. అప్పటికే సముద్రంలో రాకాసి అలలు ఎగసిపడుతూ ఉండటంతో ఆ విద్యార్థి ఊపిరి ఆడక కొట్టుమిట్టాడు తున్నాడు. విషయం గమ నించిన మరో స్నేహితుడు కేథారేశ్వరరావు సము ద్రంలో కొట్టుకుపోతున్న కార్తీక్‌ను కాపాడే ప్రయత్నం చేసేందుకు సముద్రంలో దిగడంతో ఆ యువకుడు కూడా అలల తాకిడికి గుర య్యాడు. దీంతో తోటి స్నేహితులు పెద్దగా కేకలు వేస్తుండటంతో పక్కనే ఉన్న మెరైన్ పోలీసులు విషయం గమనించి వెంటనే స్పం దించే సముద్రంలోకి వెళ్లారు. అక్కడే ఉన్న యువ కుల సాయంతో కేథారేశ్వర రావును కాపాడారు. వెంటనే చికిత్స నిమిత్తం ఆ యువవకుడిని 108 వాహనం ద్వారా చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం ఆ విద్యార్థి పరిస్థితి నిలకడగానే ఉంది. ఇదిలా ఉండగా తీరంలో గల్లంతైన కార్తీక్ కోసం మెరైన పోలీసులు మరియు రూరల్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు కార్తీక్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గల్లంతైన కార్తీక్ బీటెక్ తతీయ సంవత్సరం చదువుతున్నారు. అప్పటివరకు సరదాగా తమ కళ్ల ముందే ఉన్న స్నేహితుడు కార్తీక్ సముద్ర అలలకు ఒక్కసారిగా కొట్టుకుపోవడం చూసిన తోటి స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు.

యంత్రాంగం ప్రక్షాళన దిశగా..

(మొదటిపేజీ తరువాయి)

వేశారు. ఇంకా చెప్పాలంటే లూప్‌లైనులోనే ఉంచారు. వారంతా ఇప్పుడు బయటకు వచ్చారు. ఎక్కువగా పోలీసుశాఖలో మార్పులు కనిపించే అవకాశం ఉంది. డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలలో టిడిపి హయాంలో కీలక విభాగాల్లో పనిచేసిన వాళ్లంతా ఐదేళ్లుగా ఇబ్బందులు పడ్డారు. చాలామందిని పోస్టింగులు ఇవ్వకుండా విఆర్‌లో ఉంచారు. కొందరిని ట్రైనింగు కాలేజీలు, స్పెషల్ బ్రాంచి, క్రైమ్ విభాగాలు, ట్రాఫిక్, బందోబస్తు, పెట్రోలింగు, కాన్వాయిల్లో డ్యూటీలతో పాటు ఎస్పీ కార్యాలయానికి అనుబంధంగానూ వేశారు. ఇవన్నీ ప్రాధాన్యతల్లేని పోస్టులుగా ఉన్నాయి. సర్కిళ్లుగానీ, స్టేషన్లకు గానీ ఇవ్వలేదు. డీఎస్పీలకూ సబ్‌డివిజన్లు ఇవ్వలేదు. ఇప్పుడు అలా అజ్ఞాతంలో ఉన్న వారంతా బయటకు వచ్చారు. మంత్రులను కలిసి తిరిగి కీలక పోస్టుల్లో చేరేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇక తెలుగుదేశం నేతలపై కేసులు బనాయించిన అధికారులను మాత్రం వదిలేది లేదంటున్నారు. ఒంగోలులో జరిగిన అల్లర్లలో పోలీసులపై విమర్శలు వచ్చాయి. ఎన్నికల సమయంలోనే ఎస్పీగా ఉన్న పరమేశ్వరరెడ్డిని బదిలీ చేశారు. పలువురు సిఐలపైనా చర్యలు తీసుకున్నారు. వారందరిపై ఇప్పుడు తెలుగుదేశం నేతలు గట్టిగానే దృష్టి సారించారు. జిల్లాలో లేకుండా పంపాలనే ఆలోచన చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్లు అందరూ రాజకీయ నేతలకు అనుకూలంగానే పనిచేశారనే విమర్శలు వచ్చాయి. మండలాల్లో తహశీల్దార్లు, ఎంపీడీఓలు పూర్తిగా మారే అవకాశాలున్నాయి. ఇంజినీరింగ్ విభాగాల్లోనూ ప్రక్షాళన చేసే ఆలోచనలో ఉన్నారు. భారీ మార్పులు తప్పవనే చర్చసాగు తోంది. ఆ దిశగానే పాలకపక్ష నేతలు అడుగులు వేస్తున్నారు.

నిలిచిపోయిన 'ధాన్యం' చెల్లింపులు..

(మొదటిపేజీ తరువాయి)

నిర్ణయించారు. కానీ జిల్లా రైతులకు చెల్లించాల్సిన ఖరీఫ్ ధాన్యం కొనుగోలు బకాయిలు ఏప్రిల్ నాటికి రూ.36 కోట్ల వరకు ఉన్న నేపథ్యంలో రైతులు సదరు నగదు కోసం ఆర్‌బికేలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతూ వచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో రబీ ధాన్యం అమ్మకాల కోసం రైతులు ఆర్‌బికేల వద్దకు రాకుండా రైతులు అత్యధికంగా ప్రైవేట్‌గానే అమ్మకాలు జరిపారు. దీంతో ఆర్‌బికేల జిల్లాలో 4,879 మెట్రిక్ టన్నుల ధాన్యం అమ్మకాలు మాత్రమే జరిగాయి. రూ.10 కోట్ల మేర నగదు రైతులకు రావలసి ఉంది. రైతులకు రావలసిన ధాన్యం కొనుగోలు నగదును రాష్ట్రప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు.

'వెలిగొండ'ను పూర్తిచేస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

అండగా ఉంటామన్నారు. చంద్రబాబును, భువనేశ్వరిని అవమానించిన వారిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. జగన్‌కు కేవలం 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే మిగిలారని, వాళ్లలో ఏడుగురు టిడిపిలోకి వచ్చేందుకు రాయ బారాలు నడుపుతున్నారన్నారు. రామాయపట్నం పోర్టులో దోపిడీ జరిగిందని, ఆ దోపిడీపై విచారణ చేస్తామన్నారు. వాన్‌పిక్ భూముల్లో ఫార్మా హబ్బుగా తయారు చేసి ఉద్యోగాలు అందజేస్తామన్నారు. ఎర్రగొండపాలెం, దర్శి ఇన్‌ఛార్జిలకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తామన్నారు. దామచర్ల సత్యకు మంచి పదవి వచ్చే విధంగా ప్రయత్నం చేస్తామన్నారు. ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఒంగోలు పార్లమెంటు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని సూచించారు. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ ప్రజల నమ్మకాలని వమ్ము చేయబోమన్నారు. కార్యకర్తలకు ఇబ్బంది పెట్టిన పోలీసులను వదల బోమన్నారు. లిక్కర్ స్కామ్‌లో జగన్‌మోహన్ రెడ్డి జైలుకు పోతారన్నారు. సైకో జగన్ పార్టీ ఇక ఉండదని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ఏలూరి సాంబశివరావు, బిఎన్. విజయ్‌కుమార్, ముత్తుముల అశోక్‌రెడ్డి , డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, ఎంఎం కొండయ్య, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, వైపాలెం ఇన్చార్జి ఎరిక్షన్‌బాబు, దర్శి ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, నారశెట్టి పాపారావు, డాక్టర్ నూకసాని బాలాజీ పాల్గొన్నారు.

కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలు

- అభివృద్ధికి ఆమడదూరంలో వైపాలెం నియోజకవర్గం
- పట్టించుకోని గతపాలకులు
- టిడిపిపై ప్రజల ఆశలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కొత్త ప్రభుత్వం కొలువు తీరడంతో యర్రగొండపాలెం నియోజకవర్గ ప్రజల్లో కోటి ఆశలు రేకెత్తుతున్నాయి. గత ఐదేళ్ల వైసిపి పాలనలో ప్రభుత్వం అందించి పప్పు బెల్లాంలాంటి సంక్షేమ పథకాలు తప్ప శాశ్వత అభివృద్ధి జరగలేదు. రైతులు, నిరుద్యోగులు, పేదలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైతులు కొందరు వ్యవసాయం చేయడమే మానుకున్నారు. నిరద్యోగులు ఉద్యోగ బాట వెతుక్కుంటూ సుదూర ప్రాంతాలకు వెళ్లారు. కూలీలు వలసల పైనే ఆధార పడ్డారు. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వంలోనైనా తమ బతుకులు మారుతాయని ఆశతో ఎదురు చూస్తున్నారు.



యర్రగొండపాలెం వ్యూ

యర్రగొండపాలెం నియోజకవర్గంలో అభివద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. 2009లో యర్రగొండపాలెం ఎస్‌సి నియోజకవర్గంగా ఏర్పడింది. ఇది జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో గల నల్లమల అడవికి దగ్గరలో ఉంది. ఇక్కడ అపారమైన ఖనిజ సంపద ఉంది ముగ్గు గనులు అధికంగా ఉన్నాయి. బత్తాయి, బొప్పాయి తదితర వాణిజ్య పంటలు అధికంగా పండుతాయి. ఈ ప్రాంత బత్తాయిలకు దేశంలోనే మంచి పేరు ఉంది. అటవీ ప్రాంతంలో అపారమైన వనరులు ఉన్నాయి. అయినప్పటికీ అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉంది. 2019లో వైసిపి తరపున ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పని చేసిన ఆదిమూలపు సురేష్ ఈ నియోజకవర్గాన్ని గురించి



బత్తాయి కాయలు



వలసలు వెళ్తున్న కూలీలు

పట్టించుకోలేదు. ఫలితంగా ప్రజల పేదరికం, దారిద్ర్యం మాత్రం మారడం లేదు. ఉపాధి కోసం పొట్ట చేతపట్టుకుని పక్క రాష్ట్రానికి వలసలు తప్పడం లేదు.

ముగ్గు గనులపై శ్రద్ధ ఏదీ..

నియోజకవర్గ పరిధిలో యర్రగొండపాలెం, పుల్లలచెరువు, పెద్దదోర్నాల మండలాలు నల్లమల అడవికి ఆనుకొని ఉన్నాయి. ఈ మండలాల పరిధిలోని నల్లమల అడవిలో ముగ్గు గనులు, వనరులు పుష్కలంగా ఉన్నాయి. ముగ్గు గనులను అభివృద్ధిలోకి తీసుకొచ్చిన దాఖలాలు లేవు. ఇక్కడి ముగ్గు రాయి అంతా రహస్యంగా కడప ప్రాంతానికి తరలుతోంది. ముగ్గు గనులను ఏర్పాటు చేస్తే సుమారు మూడు వేల మందికి ఉపాధి లభిస్తోంది. ఇప్పటి వరకు దాని గురించి పట్టించుకున్న వారే లేరు.

జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు ఎప్పుడు..

నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో బత్తాయి, బొప్పాయి తదితర వాణిజ్య పంటలు పుష్కలంగా పండుతున్నాయి. ఈ ప్రాంతా బత్తాయి, బొప్పాయి ఇతర రాష్ట్రాలకు సైతం ఎగుమతులు అవుతున్నాయి. ఈ ప్రాంతంలో పండిన బత్తాయిలో పోషక విలువలు పుష్కలంగా ఉంటాయని దేశంలోనే మంచి పేరు ఉంది. ఈ ప్రాంతంలో పండిన పంటలను దృష్టిలో పెట్టుకొని జ్యూస్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఊకదంపుడు ఉపన్యాసాలు చేసింది. పట్టించుకున్న దాఖలాలు లేవు. జ్యూస్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తే మరో మూడు వేల మందికి ఉపాధి కలుగనుంది. రైతులకు సైతం రాబడి పెరిగే అవకాశం ఉంది.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ మాయం..

గత టిడిపి ప్రభుత్వ హయాంలో త్రిపురాంతకం మండలం గణపవరం ప్రాంతానికి ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ మంజూరు చేసింది. ఈ యూనిట్ నెలకొల్పితే సుమారు 3500 మంది నిరుద్యోగులకు ప్రత్యక్షంగా ఉపాధి కలగడంతో పాటు మరో 3500 మంది రైతులకు పరోక్షంగా ఆదాయం వచ్చేది. మంజూరైన యూనిట్‌ను స్థానిక నేతలు ఏర్పాటు చేయకుండా అశ్రద్ధ చేయడంతో రాజకీయం ఉపయోగించి కొందరు ఆ యూనిట్‌ను అద్దంకికి తరలించారు. దీంతో ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి కరువైంది. మరో యూనిట్‌ను నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ కూడా నీటి మూటగానే మారింది.

పూర్తికాని నీటి వనరులు..

వెలిగొండ ప్రాజెక్టు తీగలేరు కాలువ ద్వారా యర్రగొండపాలెం నియోజకవర్గంలోని 64 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకుండానే అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రెండు టన్నెల్‌లను జాతికి అంకితం చేశారు. తీగలేరు కాలువ మరమ్మతులకు గురైంది. టి-5 కాలువ నిర్మాణం పూర్తయితే పుల్లలచెరువు మండలంలో 11,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇది కూడా కాగితాలకే పరిమితమైంది. వెంకటాద్రిపాలెం సమీపంలోని కోటగట్ల చెరువు హామీగానే మిగిలింది. నియోజకవర్గ పరిధిలో 76 చెరువులు ఉన్నాయి. అవి మరమ్మతులకు గురి కావడంతో వర్షాకాలంలోనూ చుక్క నీరు నిలవడం లేదు. ఆయకట్టు భూములన్నీ బీడు భూములుగా మారుతున్నాయి.

నిత్యం వలసలే..

పాలకులు మారుతున్నా ఈప్రాంత ప్రజలకు ఉపాధి కోసం వలసలు తప్పడం లేదు. పది మందికి ఉపాధి కల్పించే పరిశ్రమ ఏదీ లేకపోవడంతో వలసలు అధికంగా ఉంటున్నాయి. గత్యంతరం లేక ప్రతియేటా 25 వేల మంది వలసబాట పడుతున్నారు. బతుకుదెరువు వెతుక్కుంటూ ఇతర రాష్ట్రాలకు సైతం వెళుతున్నారు. ఎక్కువగా వెనుకబడిన వర్గాల వారే వలసబాట పడుతున్నారు.

కొత్త ప్రభుత్వంపై ఆశలు

మెడబలిమి అచ్యుతరావు, యర్రగొండపాలెం



గత ఐదేళ్ల కాలంలో వైసిపి ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడింది. వలసలు అధికమయ్యాయి. రైతాంగం ఇబ్బందులు పడుతున్నారు. నిరుద్యోగం పెరిగిపోతుంది. అభివృద్ధి కావాల్సిన అవసరమైన వనరులు పుష్కలంగా ఉన్నాయి. ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనేనైనా ఉన్న వనరులను సద్వినియోగం చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారని ఆశగా ఉన్నాం.

పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

ఊట్ల సుబ్బారావు, మిట్టపాలెం



యర్రగొండపాలెం నియోజకవర్గంలో ముగ్గు గనులు ఉన్నాయి. బత్తాయి, బొప్పాయి తదితర వాణిజ్య పంటలు విస్తారంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాంతంలో ముగ్గు పరిశ్రమ, జ్యూస్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు చేయడం తద్వారా నిరుద్యోగులు, పేదలకు ఉపాధి దొరుకుతుంది. రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతారు.

ఎంపీ మాగుంట బక్రీద్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలోని ముస్లింలకు ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇస్లాం ధర్మశాస్త్రం ప్రకారం దురాచారాలను, బడుగు, బలహీన వర్గాల అణచివేతను వ్యతిరేకించి ధర్మ సంస్థాపన కోసం యుగపురుషుడు అబ్రత్ ఇబ్రహీం జీవితాంతం చేసిన త్యాగాలకు ప్రతీకగా ప్రపంచవ్యాప్తంగా ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను జరుపుకొంటారు.ఎదలకు దానధర్మాలు, భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగను జరుపుకోవాలని ప్రకాశం జిల్లా ముస్లిం సోదరులు, ప్రజలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

'దామచర్ల' శుభాకాంక్షలు

బక్రీద్ సందర్భంగా జిల్లాలోని ముస్లిములకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లీంలు ఎంతో భక్తి శ్రద్ధలతో ఈ పండుగను జరుపుకుంటారన్నారు. భక్తి భావం, కరుణ, సహనాన్ని బక్రీద్ చాటి చెబుతుందన్నారు. త్యాగానికి ప్రతీకగా ఈ బక్రీద్ పండుగను జరుపుకుంటారని తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ప్రైవేట్ బస్సు

- క్లీనర్ మృతి
- ఆరుగురికి గాయాలు
- బాపట్ల నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఘటన



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు



తిమ్మిశెట్టి మణికంఠ(ఫైల్)

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్ (పల్నాడు జిల్లా)

ఆగి ఉన్న లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీ కొట్టిన ఘటనలో బస్సు క్లీనర్ మృతిచెందాడు. మరో ఆరుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ ఘటన పల్నాడు జిల్లా, సత్తెనపల్లి మండలం, కంటిపూడి సమీపంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో నరసరావుపేట మండలం కాకాని గ్రామానికి చెందిన బస్సు క్లీనర్ తిమ్మిశెట్టి మణికంఠ (24) మతిచెందారు. ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల నుంచి 30 మంది ప్రయాణికులతో హైదరాబాద్ వెళతున్న మార్నింగ్ స్టార్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కంటిపూడి సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో ఆగి ఉన్న లారీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు క్లీనర్ తో పాటు మరో 6 ప్రయాణికులు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన క్లీనర్‌ను 108 వాహనం ద్వారా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మతి చెందాడు. బాపట్లకు చెందిన లక్ష్మిసుధా, కె. చంద్రశేఖర్, అతని భార్య లక్ష్మి , పత్తిపాడుకు చెందిన వై.ప్రసాద్ రెడ్డి, గార్లపాడుకు చెందిన రత్తయ్య, పెదనందిపాడు కు చెందిన మాధవి గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్లీనర్ మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి వైద్యశాలకు తరలించారు. మతుడు తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి రూరల్ ఎఎస్ఐ కరిముల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు . ట్రావెల్స్ బస్సు డ్రైవర్ ఈదర రమేష్ బాబును అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేస్తున్నారు.లారీ డ్రైవర్, క్లీనర్ పరారీలో ఉన్నారు.



విరాళం అందిస్తున్న డాక్టర్ ధనుంజయుడు కుటుంబ సభ్యులు

రూ.10వేల విరాళం అందజేత

ప్రజాశక్తి -కనిగిరి

సాయి సిద్ధార్థ హాస్పిటల్ అధినేత మర్రి ధనంజయుడు, వారి కుటుంబ సభ్యులు డాక్టర్ బంకా అనురాధ, మర్రి, హేమంత్ సాయి, కమ్యూనిటీ వైద్యశాల వైద్యుడు డాక్టర్ బంకా చంద్రేష్ కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహరెడ్డిని ఆదివారం మర్యాద పూర్వకం గా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కనిగిరి అభివద్ధి కమ్యూనిటీ వైద్యశాలలో పేదలకు అందించిన సేవలు, ఆపరేషన్ సదుపాయలు, డాక్టర్ల గురించి చర్చించారు. ఈ సందర్భంగా అన్నా క్యాంటీన్ నిర్వహణకు రూ.10 వేల విరాళాన్ని అందజేశారు. పేద ప్రజలకు వైద్య సేవలను ఉచితంగా అందిస్తామని తెలిపారు.

117 జీవోను రద్దు చేయాలి : ఎపిటిఎఫ్



మాట్లాడుతున్న జానార్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి -కనిగిరి

విద్యా రంగ అభివృద్ధికి ఆటంకంగా మారిన 117 జీవోను వెంటనే రద్దు చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్ధన్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక కార్యాలయంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పి.రాజ్‌కుమార్ అధ్యక్షతన కనిగిరి జోన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ డిఇఒ కార్యాలయంలోని సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. తెలుగు స్కూల్ అసిస్టెంట్ సీనియారిటీ లిస్టును ప్రకటించాలని కోరారు. నూతన ప్రభుత్వం విద్యా రంగాన్ని కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలనికోరారు. జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ పాఠశాలల్లో తెలుగు మీడియం కొనసాగించాలన్నారు. ప్రతి హైస్కూల్‌లో హెచ్ఎం పోస్ట్ తప్పనిసరిగా ఉంచాలన్నారు. తల్లికి వందనం కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలకు మాత్రమే వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కనిగిరి జోన్ నాయకులు హజరత్ రెడ్డి, మచ్చ ప్రసాద్, పాకల శ్రీను, బివిఎస్.ప్రసాద్, ఎన్.రమేష్ బాబు, తోట శ్రీనివాసులు, ఆనంద్, రామమోహన్, సుబ్బ రాయుడు, పొట్టేండ్ల మాలకొండయ్య, రామకష్ణ, ఇండ్ల ప్రసాద్, రాములు, సుబ్బయ్య, దండే శ్రీనివాసులు, భాస్కర్ రెడ్డి, ఒంగోలు వెంకటేశ్వర్లు, నజీర్ బాషా, నారాయణ, సుబ్బయ్య, కొండలరావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఉగ్రతో ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ యూనియన్ నాయకులు

ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ యూనియన్ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, ప్రకాశం జిల్లా అధ్యక్షులు పోలిచర్ల రషీద్ మాట్లాడుతూ మెగా డిఎస్సిని విడుదల చేయటం పట్ల ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ధన్యవాదములు తెలిపారు. నియోజకవర్గం లోని ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్ల సమస్యలను తీర్చాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ పట్టణ అధ్యక్షుడు సిహెచ్. యరాజాశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మెగా డిఎస్‌పిలో వయో పరిమితిని సడలించి మరి కొంతమంది అభ్యర్థులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అన్ని విషయాలను పరిశీలించి తగిన న్యాయం చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తాతపూడి విజయ ్కుమార్, ఎస్‌కె.ఖాదర్‌వలి, సంధ్య, అశ్విని బాల నారాయణ, వెంకటేశ్వర్లు, భవాని, స్వర్ణ, విజయ, దుర్గ, నాగరాజు, రమేష్, మహేంద్ర, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ డిప్లమో కోర్సులకు నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి-దర్శి

వ్యవసాయ డిప్లమో కోర్సులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.సంధ్యారాణి తెలిపారు. ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించే వ్యవసాయం కళాశాల డిప్లమో కోర్సుల్లో చేరేవారు ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు దారులు 2023 ఆగస్టు 31 నాటికి 15 సంవత్సరాల నుంచి 22 వయస్సు కలిగిఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాలకు 77 శాతం పట్టణ ప్రాంతాలకు 25శాతం చొప్పున సీట్లు కేటాయించినట్లు ఆమె తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. లేదంటే దర ఖాస్తులను కళాశాలలో కూడా అందజేయవచ్చునని ఆమె తెలిపారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

ఆగిపోయిన అభివృద్ధి పనులన్నీ పూర్తి చేస్తాం : దామచర్ల

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులో ఆగిపోయిన అభివద్ధి పనులన్నీ పూర్తి చేస్తామని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ పేర్కొన్నారు. పిఎల్ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధతి డెవలపర్స్ వారి ఒంగోలు బ్రాంచి, ఓజాస్ మార్కెటింగ్ ఆఫీస్‌ను గుంటూరు రోడ్డులోని గుప్తాస్ మిడ్‌టౌన్ మూడో అంతస్తులో ఎమ్మెల్యే దామచర్ల ఆదివారం ఉదయం ప్రారంభించారు. ముందుగా జిబికే రియల్ ఎస్టేట్, మరియు ఓజాస్ రియల్ ఎస్టేట్ మార్కెటింగ్ సారథులు గంధవల్ల బాలకష్ణ, కల్లగుంట హేమంత్, సింగమనేని సురేష్ దామచర్లకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ మంచి సంస్థల వ్యాపార అభివద్ధికి సంపూర్ణ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ధతి డెవలపర్స్ అధినేత పిఎల్.రమేష్ పాల్గొన్నారు.

'పోతుల'కు జన్మదిన శుభాకాంక్షలు



పోతుల నరసింహారావును సన్మానిస్తున్న యువకులు

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరులోని ఎస్ఎల్‌టిసిలో‌లో పోతుల నరశింహారావు జన్మదిన వేడుకలు ఆదివారం నిర్వ హించారు. ఈ సంద ర్భంగా యవకులు పోతు నరసింహా రావుకు శాలువాలు కప్పి పూల దండలు వేసి సత్క రించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు, స్వర్గీయ పోతుల చెంచయ్య జయంతి, ఆయన కుమారుడు పోతుల నరశింహారావు జన్మదినం ఒకే రోజు కావడం విశేషం. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు కామని నాగ శ్రీను, ఎస్ఎల్‌టిసి ప్రతినిధులు చిడిపోతు కోటేశ్వరరావు, రావూరి సతీష్, చిడిపోతు లక్ష్మయ్య, కామినేని కోటేశ్వరరావు, నార్ని హరిబాబు, పమిడి సుబ్బానాయుడు, పరిమి వంశీకృష్ణ, చిడిపోతు నాయుడు, ఈదర శ్రీను, వాణీ నగర్ యువకులు , పవన్ తదితరులు పాల్గొన్నారు.

తేనె టీగల దాడిలో భర్త మృతి

భార్య పరిస్థితి విషమం



మృతిచెందిన సుందరావు

ప్రజాశక్తి -వెలిగండ్ల

కొండ తేనె టీగల దాడిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈఘటన మండల పరిధిలోని ఇమ్మడి చెరువు-బాపన పల్లె మార్గమధ్యలో ఆదివారం చోటు చేసుకుంది. ఇమ్మడి చెరువు గ్రామానికి చెందిన జుటికే సుందరరావు (72) రోజమ్మ దంపతులు ఉదయం 11:30 గంటల సమ యంలో బైకు కనిగిరి వెళ్తున్నారు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి తేనె టీగలు వారిపై దాడి చేశాయి. దీంతో వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వస్తున్న ప్రయాణిస్తున్న విషయాన్ని గమనించి సుందరావు, రోజమ్మ కనిగిరి వైద్యశాలకు తరలి స్తుండగా మార్గమధ్యలో సుందరావు మృతి చెందాడు. రోజమ్మ పరిస్థితి కూడా విషయంగానే ఉన్నట్లు తెలిసింది. ప్రభుత్వం స్పందించి మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అం,జేసి ఆదుకోవాలని స్జానికులు కోరారు.

ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని తోకలవానిపాలెం, తురకపాలెం గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీల పని ప్రదేశాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్ ఆదివారం పరిశీలించారు. సంఘం మండల కార్యదర్శి బోనిగల సుబ్బారావు, టి కృష్ణమోహన్ మాట్లాడుతూ పనిచేసిన 15రోజుల్లోపు ఉపాధి కూలీల వేతనం ఇవ్వాలని చట్టం చెప్తుంటే పనిచేసి 15 వారాలు గడిచిన వేతనాలు విడుదల చేయడం లేదని ఆరోపించారు. ఉపాధి కూలీలు పేదవారని, ఏ రోజుకు ఆ రోజు తెచ్చుకుంటేనే కుటుంబం గడవని పేదలకు నెలలు తరబడిన కూలీ డబ్బు రాకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఎక్కువ మంది కూలీలకు ఉపాధి పనులు లేక ఇళ్లవద్దే ఉంటున్నారని అన్నారు. కొంత మందికి వంద రోజులు మాత్రమే పని ఉంటుందని, అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. కావున ఎన్ఆర్ఇజిఎస్ అధికారులు పంచాయతీ, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి పనుల అనుమతులు ఇవ్వాలని కోరారు. పనులకు అనుమతులు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాలు ప్రారంభం అవుతున్నందున వెంటనే ఉపాధి పనులను ప్రారంభించి పనులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధి హామీ మెట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న టి కృష్ణమోహన్

అమర్నాథ్ హంతకులను శిక్షించాలి

ప్రజాశక్తి - చెరుకుపల్లి

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన పదో తరగతి విద్యార్థి అమర్నాథ్ హత్య వంటి సంఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ మణిలాల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉప్పాల అమర్నాథ్ మొదటి వర్ధంతి సభ అమర్నాథ్ స్వగ్రామమైన ఉప్పాలవారి పాలెంలో ఆదివారం నిర్వహించారు. అమర్నాథ్ కుటుంబ సభ్యులు, ప్రజా సంఘా ల నాయకులు, బీసీ, గౌడ సంఘ నాయకులు అమర్నాథ్‌కు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వర్ధంతి సభకు బీసీవై రాష్ట్ర అధ్యక్షులు దొంత సురేష్ అధ్యక్షత వహించారు. సభలో మణిలాల్ మాట్లాడుతూ అతి చిన్న వయసులో కిరాతకంగా హత్య చేయబడిన అమర్నాథ్ కేసును నూతన ప్రభుత్వమైనా ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు వెంటనే నిందితులకు శిక్షపడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శరత్, కొప్పుల గోపి, ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షులు మనోజ్ కుమార్, బీసీ ప్రజాసంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉప్పాల అమర్నాథ్ మొదటి వర్ధంతి సభలో ప్రజాసంఘాల నాయకులు

చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని శ్రీ వీరబ్రహ్మేంద్రబ్రిక్ ఇండస్ట్రీ ఆవరణలో టిడిపి విశ్వబ్రాహ్మణ సాధికార కమిటీ కన్వీనర్ తువ్వపాటి జనార్ధనాచారి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, అద్దంకి ఎమ్మెల్యేగా గొట్టిపాటి రవికుమార్, ఒంగోలు పార్లమెంటు ఎంపీగా మాగుంట శ్రీనివాసులురెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధించినందుకు కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. వీరి పాలనలో అట్టడుగున్న బీసీలు, సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ముందుకు వెళ్తారనే ఆశ భావం వ్యక్తం చేశారు. వారి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చెన్నుపల్లి కోటిలింగాచారి, జాగర్లమూడి శ్రీనివాసరావు, బీసీ నాయకులు రవిచంద్రచారి, విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుందుర్తి సీతారామాంజనేయులు, టీడీపీ నాయకులు ఏజెండ్ల ఆంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి పొన్నపల్లి బ్రహ్మానందం, ఆళ్లగడ్డ వీర సుందరాచారి, ముత్తలూరు హరిబాబు, గుండెమెడ వెంకటేశ్వర్లు, ఏలూరు వీర బ్రహ్మాచారి, మహిళ నాయకురాలు లీలా కుమారి, లాయర్ బహునాదం నాగాచారి, తెనాలి బ్రహ్మం పాల్గొన్నారు.



కేకు కట్ చేస్తునన విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

ముస్లిములకు గొట్టిపాటి బక్రీద్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - అద్దంకి

రాష్ట్రంలోని ముస్లిం సోదరులకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదరులు ఎంతో భక్తి శ్రద్ధలతో ఈ పండుగ జరుపుకుంటారని పేర్కొన్నారు. భక్తి భావం, కరుణ, సహనాన్ని బక్రీద్ చాటి చెబుతుందని తెలిపారు. త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగ జరుపుకుంటారని అన్నారు. మహ్మద్ ప్రవక్త బోధనలు, విధానాలు అందరికీ అనుసరణీయమని తెలిపారు. బక్రీద్ దేవుని పట్ల సంపూర్ణ భక్తి భావం, పేదలకు సాయం చేసే తత్వం, ఇతరుల పట్ల సోదర భావాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. అల్లాహ్ దయతో రాష్ట్ర ప్రజలందరూ ఆరోగ్య, సుఖ శాంతులతో జీవించాలని కోరారు.



మంత్రి గొట్టిపాటి రవికుమార్

బాపట్ల : ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే బక్రీద్ పండుగకు పట్టణంలోని అన్ని మసీదులు, ఈద్గాలు ముస్తాబు అయ్యాయి. త్యాగానికి ప్రతీకగా సమత, మమతల సమ్మిళితాన్ని చాటిచెప్పే అతి పవిత్రమైన పండుగ బక్రీద్ వేడుక. ఈ పండుగకున్న ప్రాధాన్యత దృష్ట్యా ఇతరుల పట్ల దయ, కరుణ, ప్రేమ, వాత్సల్యాలను పెంపొందిస్తాయని ప్రజలు విశ్వసిస్తారు. సాధారణ వ్యక్తి జీవితాన్ని సమాజానికి ఉపయోగపడే సద్గుణాలను నింపి సోదర భావాన్ని కలిగిస్తుంది. ఇదే ఇస్లాం మూల సూత్రాల్లో ప్రధానమైన లక్ష్యంగా నిరుపేదల పట్ల సేవ చేయాలనే సంకల్పం, సన్మార్గంలో నడిచే ఒక అద్భుత అవకాశం, త్యాగనిరతిని చాటి చెప్పే పవిత్ర పండుగగా బక్రీద్ జరుపుకుంటారు. ఉదయం ఏడు గంటలకు ప్రత్యేక ప్రార్ధనలు ప్రారంభమవుతాయని అంజుమన్ కమిటీ కార్యదర్శి అబ్దుల్ కరీం తెలిపారు. శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సామరస్యపూరిత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని కోరారు.



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ ఎంవి దుర్గాకుమార్

ఉత్తమ ఫలితాలు సాధించిన శ్రీ మేధావి

ప్రజాశక్తి - చీరాల

ఇంటర్, ఎంసెట్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు శ్రీమేధావి జూనియర్ కాలేజీ డైరెక్టర్ ఎంవి దుర్గాకుమార్ తెలిపారు. విద్యా సంవత్సరం పున ప్రారంభం సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఈనెల 19న బుధవారం నుండి ఇంటర్ తరగతులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపిసిలో ఎం భవ్యశ్రీ, ఎ నవ్య అనే ఇద్దరు విద్యార్థులు 464మార్కులు, బైపిసిలో ఐఎల్ గ్రిష్మంత్ 428మార్కులు, ఎంఇసిలో ఎంఎస్ఎల్ హర్షిత 479 మార్కులు, జూనియర్ ఇంటర్ సిఇసిలో వివిఎస్ శ్రీహర్షిణి 446మార్కులు, సీనియర్ ఇంటర్ ఎంపిసిలో జి వీణప్రసన్న 986మార్కులు, సీనియర్ ఇంటర్ బైపిసిలో ఎల్ కనకదుర్గ 977మార్కులు సాధించి పట్టణ, జిల్లా స్థాయిలో నిలిచినట్లు తెలిపారు. ఎంసెట్ మెడిసిన్‌లో బి విజయలక్ష్మి 2589వ ర్యాంకు, ఇంజనీరింగ్‌లో టి సాహితి 11278వ ర్యాంకుతోపాటు ఇంజనీరింగ్‌లో 15వేల లోపు ర్యాంకులు మరో ఎనిమిది మంది సాధించినట్లు తెలిపారు. ఇంటర్ పరీక్షలతోపాటు ఎంసెట్, నీట్, ఐఐటి, సిఎ వంటి పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. మారుతున్న పోటీకి తగినట్లు విద్యార్థులను తీర్చి దిద్దుతున్నట్లు తెలిపారు.

నేడు ముప్పవరం రానున్న గొట్టిపాటి

ప్రజాశక్తి - పంగులూరు

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం ముప్పవరంలోని తెలుగుదేశం కార్యాలయంకు రానున్నట్లు చిలకలూరిపేటలోని క్యాంపు కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 10 గంటలకు ముప్పవరం టిడిపి కార్యాలయం వద్దకు చేరుకుంటారని తెలిపారు.



ఆరోగ్య శాఖ మంత్రి సతీష్‌కు గొట్టిపాటి అభినందన

గొట్టిపాటిని కలిసిన సతీష్‌కుమార్

ప్రజాశక్తి - అద్దంకి

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మాత్యులు గొట్టిపాటి రవికుమార్ నేడు ఉదయం 10గంటల నుండి జె పంగులూరు మండలంలోని తెలుగుదేశం కార్యాలయంలో ప్రజలకు అందులో అందుబాటులో ఉంటారని క్యాంప్ కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను మర్యాదపూర్వకంగా దెందులూరు శాసన సభ్యులు చింతమనేని ప్రభాకర్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఆదివారం బాధ్యతల స్వీకరించిన సతీష్ కుమార్‌కు మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుభాకాంక్షలు తెలిపారు.



రిసార్ట్స్ ప్రారంభిస్తున్న నరేంద్రవర్మ

కోమలి బీచ్ రిసార్ట్స్‌ను ప్రారంభించిన నరేంద్రవర్మ

ప్రజాశక్తి - బాపట్ల

పర్యాటక కేంద్రంగా బాపట్లకు అత్యంత సమీపంలో అభివృద్ధి చెందుతున్న సూర్యలంక బీచ్ సందర్శకులకు ప్రైవేటు రంగంలో విలాస వంతమైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్న కోమలి బీచ్ రిసార్ట్ యాజమాన్యం సేవలు అభినందనీయమని శాసన సభ్యులు నరేంద్రవర్మ అన్నారు. బాపట్ల - సూర్యలంక రహదారి మార్గంలో ముత్తాయపాలెం సమీపంలో అన్ని హంగులతో నిర్మించిన కోమలి బీచ్ రిసార్ట్స్‌ను నరేంద్ర వర్మ రాజు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో రిసార్ట్ నిర్వాహకులు ఉప్పల వీరాస్వామి, జి చార్వాక్, కె ధనేంద్ర, టిడిపి పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏవీవీ హై స్కూల్ పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలోని ఎవివి హైస్కూలు 1998-99 బ్యాచ్ 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పాఠశాల నాటి విద్యార్థులు పాఠశాల్లో కలుసుకొని ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, వ్యవసాయంలో స్థిరపడిన ఆనాటి పదో తరగతి విద్యార్థులు ఒకరినొకరు పరిచయం చేసుకొని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చిన్న నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని ఒకరికి ఒకరు సంతోషం వ్యక్తం చేశారు. వారు చేస్తున్న వృత్తి, ఉద్యోగాలు తెలుసుకొని, వారికి పాఠాలు నేర్పిన గురువులను సత్కరించి, వారిపట్ల గౌరవాన్ని చాటుకున్నారు. చదువుకున్న పాఠశాలకు మరమత్తులు, ఇతర అభివృద్ధి పనులకు తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ ఇదే..

ప్రజాశక్తి -కనిగిరి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కనిగిరి తాలూక యూనిట్ ఎన్నిక ఏకగ్రీవమైంది. స్థానిక వైష్ణవి మహిళా డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా సయ్యద్ మసూద్ ఆలీ వ్యవహరించారు. కనిగిరి ఆర్‌టిసి డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎపిపిటిడి ఉద్యోగి మంద్రు రమేష్ బాబు తాలూక యూనిట్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా మహిళా అభివద్ధి శిశు సంక్షేమ శాఖ శాఖలో పనిచేస్తున్న జివి. సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా ట్రెజరీలో పనిచేస్తున్న పి.శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షుడిగా గురువాజి పేట పిచ్‌సిలో పనిచేస్తున్న రామకష్ణ రెడ్డి, ఆర్గనైజేషన్ కార్యదర్శిగా ఎస్‌టిఒలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కె.ప్రసాద్ చంద్ర, ఉపాధ్యక్షుడిగా కె.ప్రసాద్ రెడ్డి, మస్తాన్ వలి, మల్లేశ్వరి,గోపినాథ్, మల్లికార్జున, మున్నిసా బేగం, నారాయణ రెడ్డి, సహాయ కార్యదర్శిలుగా ఎ.రవి, ఉస్మాన్ బాషా, పి. వెంకట రెడ్డి, పి.రామకష్ణ రెడ్డి, కె.కొండయ్య, కె.చంద్ర కుమారి ,నిర్మలకుమారి ఎన్నికయ్యారు. నూతన స్థానిక కమిటీ అమరావతి గ్రౌండ్స్‌లో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు నిస్వార్థంతో సేవ చేసి ప్రజల మనల్ని పొందాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం కషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా నాయకులు సయ్యద్ మాసూద్ అలీ, కెపి.రంగా రెడ్డి, అక్బర్ బాషా, ఆర్.వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.



నూతన కమిటీతో ఎమ్మెల్యే ఉగ్ర



ఎమ్మెల్యే శుకాంక్షలు తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

ఎమ్మెల్యే ఉగ్రకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-సిఎస్.పురం

కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని యుటిఎఫ్ మండల నాయకలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కనిగిరిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు విద్యా సమస్యలను ఎమ్మెల్యే దష్టికి తీసుకు వెళ్లినట్లు యుటిఎఫ్ నాయకులు తెలిపారు. జీవో నంబర్ 117ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎ. సురేష్, ప్రధాన కార్యదర్శి షేక్.పాదుషా, సీనియర్ సభ్యులు ఎన్.వెంకట్రామయ్య, పి.నాయబ్ రసూల్ ,జి.శ్రీనివాసులు,జి.లక్ష్మీనారాయణ, ఎం.సురేష్, ఎం.కష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు విజయకుమార్, దామచర్ల జనార్ధన్‌రావు

పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి విజయం సాధించిన సందర్భంగా మండల పరిధిలోని చేకూరపాడు గ్రామానికి నియోజకవర్గ రైతు అధ్యక్షుడు ఇంటూరి శ్రీనివాసరావు, పోతవరం గ్రామానికి చెందిన రాయపాటి సురేష్ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతికి పాయాత్ర ప్రారంభించారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్. విజయకుమార్ ,ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, విజయమకుమార్, దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు వైసిపి అరచాక పాలనను సాగనంపి టిడిపి కూటమికి 164 సీట్లు అందించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యంలో రాష్ట్రాభివద్ధికి కషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ , మాజీ ఎంపిపి వీరయ్య చౌదరి, టిడిపి మండల అధ్యక్షుడు తేళ్ళ మనోజ్ ,మండల కార్యదర్శి కాకర్ల లక్ష్మి వరప్రసాదు, రాష్ట్ర రైతు కార్యదర్శి డాకా శ్రీనివాసరెడ్డి, మద్దిపాడు మండల టిడిపి అధ్యక్షుడు మండవ జయంతి బాబు, క్లస్టర్ ఇన్‌ఛార్జి గుమ్మడి సాయిబాబా,సర్పంచి రమేష్ , కరణం మోహన్ ,టిడిపి మండల అధ్యక్షుడు షేక్ ఖాజావలి, పి.సునీల్ , దివి పున్నారావు, నార్నె అంజయ్య, గూడూరి రఘునీన్, శరత్ ,శేషారావు,వెంకి తదితరులు పాల్గొన్నారు.

పేస్‌లో ముగిసిన వర్క్‌షాపు



అప్లికేషన్ గురించి వివరిస్తున్న పవన్‌కుమార్

ప్రజాశక్తి- టంగుటూరు

స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో గూగుల్ ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్‌పై గత మూడు రోజులుగా వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎడూస్కిల్స్ ప్రతినిధి పవన్‌కుమార్, గూగుల్ ఆండ్రాయిడ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ ట్రైనర్‌గా హాజరయ్యారు. విద్యార్థులకు ఉపయోగపడేలా మంచి టెక్నికల్ నాలెడ్జని అందించారు. ఈ టెక్ క్యాంపు వల్ల కళాశాలలో ఫైనలలియర్ విద్యార్థులు లేటెస్టు టెక్నాలజీలలో ఒకటైన గూగుల్ ఆండ్రాయిడ్ అప్లికేషన్స్ డెవలప్ మెంట్ కు సంబంధించిన ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ ని ఉపయోగించి మొబైల్‌లో అప్లికేషన్ ఎలా డెవలప్ చేయాలో క్లుప్తంగా నేర్చుకున్నారు. మొబైల్ ఎలా రన్ చేయాలో ప్రాక్టికల్‌గా విద్యార్థులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాపుల వల్ల విద్యార్థులు అడ్వాన్స్ టెక్నాలజీలో మంచి ప్రాక్టికల్ నాలెడ్జ కలుగుతుందన్నారు.తద్వారా పెద్దప్యాకేజీలతో క్యాంపస్ ప్లేస్ మెంట్స్‌లో సెలక్ట్ అవటానికి దోహదపడతాయని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జివికె. మూర్తి, డీన్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ కె. రూప అక్కేష్, డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ వీరాంజనేయులు, కళాశాల ప్లానింగ్ అండ్ ఎవల్యూషన్ డైరెక్టర్ డాక్టర్ టి. రామ చైతన్య, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వంశీకృష్ణ

130 మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి గ్రామంలో ఆరోగ్యసిరి కార్యక్రమంలో భాగంగా మనం-మనఊరు-మన ఈదుమూడి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు కావూరి వాసు ఆధ్వర్యంలో ఒంగోలు శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ వైద్యశాల సహకారంతో ఆదివారం ఉచితవైద్యశిభిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు చాపల వంశీకష్ణ, డాక్టర్ చంద్రమౌలి 130 మందికి బిపి , షుగర్, ఇజిసి,గుండె తదితర వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కావూరి వాసు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తరుణంలో పేదలకు వైద్యం అందని నేపథ్యంలో ప్రతి నెలా క్రమం తప్పకుండా అన్నిరకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సంస్థ సభ్యులు , గ్రామస్తులు ,వైద్యశాల పిఆర్‌ఒలు నాగరాజు, పున్నయ్య,శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహం ఆవిష్కరణ



ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గొట్టిపాటి లక్ష్మి

ప్రజాశక్తి-కురిచేడు

మండల పరిధిలోని పడమర వీరయ్యపాలెం గ్రామంలో టిడిపి వ్యవస్థాపకులు, కీర్తిశేషులు మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ రామారావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. టిడిపి దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ కీర్తిశేషులు ఎన్‌టిఆర్ ముఖ్యమంత్రిగా ఆయన హయాంలో సంక్షేమానికి ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లలిత సాగర్, టిడిపి మండల ఇన్‌ఛార్జి నెమలియ్య, మొగల్ మస్తాన్‌వలి, పి.కోటిలింగం, రావిపాటి శ్రీను, ఉన్నగిరి కోటేశ్వరరావు, గంధం గుర్నాథం, దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, డాక్టర్ సునీల్, గడ్డం బాలయ్య, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్



స్థానికులతో మాట్లాడుతున్న అబ్బుల్ గఫార్

ప్రజాశక్తి -కనిగిరి

వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ తెలిపారు. ప్రజల ఫిర్యాదులో భాగంగా 11వ వార్డు పరిధిలోని సూర పాపిరెడ్డి నగర్‌ను ఆదివారం సంద ర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గఫార్ మాట్లాడుతూ సూరపాపిరెడ్డి నగర్‌లో గతంలో నీరు అందుబాటులో లేక ట్యాంకర్లపైనే ఆధారపడి ఉండేవారని తెలిపారు. దీంతో అక్కడ బోరు ఏర్పాటు చేసి వీధులకు నీరందిస్తున్నామని తెలిపారు. త్వరలో మిగతా చిన్నచిన్న వీధులకు నీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారం లోపు అన్ని స్తంభాలకు విద్యుత్ దీపాలుఏర్పాటు చేస్తామన్నారు. వార్డుల్లో సమస్యలు ఉంటే తమ దష్టికి తీసుకుని వస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బెంజిమెన్, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.



దామచర్లసత్య, మంతెను సన్మానిస్తున్న దేవినేని

సత్యను సన్మానించిన దేవినేని

టంగుటూరు : టిడిపి జోన్-1 ఇన్‌ఛార్జి , రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, జోన్-3 ఇన్‌ఛార్జి మాజీ ఎమెల్సీ మంతెన సత్యన్నారాయణ రాజు విజయవాడ లోని గొల్లపూడిలో మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆయన నివాస గృహంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేవినేని శాలువాలు కప్పి పుష్పగుచ్చం అందజేసి సత్య, మంతెనకు అభినందనలు తెలిపారు

తిరుమలకు రాజధాని రైతుల పాదయాత్ర



పాదయాత్రలో భాగంగా ఇంకొల్లు చేరిన రాజధాని రైతులు

ప్రజాశక్తి - ఇంకొల్లు

తెలుగుదేశం అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రిగా పదవి చేపట్టి అమరావతిని రాజధానిగా నిర్మాణ పనులు వెంటనే చేపట్టినందుకు రాజధాని ప్రాంతంలోని వెంకటపాలెం గ్రామానికి చెందిన రైతులు పలువురు తిరుమలకు కాలినడకన బయలుదేరారు. అందులో భాగంగా కాలినడకన వెళుతున్న రైతులు ఆదివారం సాయంత్రం ఇంకొల్లు చేరుకున్నారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా జగన్ ముఖ్యమంత్రిగా ఉండి అమరావతి రాజధానిని నాశనం చేసి మహిళలను అగౌరపరిచి విధ్వంసం సృష్టించారాని అన్నారు. అప్పటి నుంచి తాము రాష్ట్రానికి అమరావతి రాజధాని కావాలంటూ నిరాటంకంగా నిరసన కార్యక్రమాలు, దీక్షలు చేపట్టి పాదయాత్ర కూడా రాష్ట్రమంతా చేశామని అన్నారు. దేవుడు, ఆంధ్రప్రదేశ్ ప్రజలు కరుణించి విధ్వంసపు జగన్‌కు బుద్ధి చెప్పి ఎన్డీఏ కూటమికి ఊహించని అఖండ మెజార్టీ ఇచ్చారని అన్నారు. ఇప్పుడు మళ్లీ అమరావతి రాజధానిగా మారేందుకు చంద్రబాబుకు ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించడంతో తమ మొక్కులు తీర్చు కునేందుకు వెంకటపాలెం నుంచి తిరుమలకు కాలినడకన బలిదేరినట్లు తెలిపారు. కాలినడకన బయలుదేరిన వారిలో జొనలగడ్డ భాస్కరరావు, దువ్వాడ వెంకటేశ్వర్లు, అబ్బూరి శ్రీనివాసబాబు, చెరెడ్డి జనార్దనరావు, ఆలపాటి బాలచంద్రుడు, ముప్పవరపు వెంకటేశ్వర్లు, తల్లారి శేఖర్, నల్లజల విశ్వేశ్వరరావు, అంబటి శివ, పోలిశెట్టి రమణ, ఉంగుటూరు శివ, శివశంకరరావు పాల్గొన్నారు.

ఇమామ్‌లకు వేతనాలు ప్రభుత్వమే ఇవ్వాలి



భట్టిప్రోలు ముస్లిం మసీదు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మసీదుల్లో పనిచేసే మౌజు, ఇమామ్‌లకు ప్రభుత్వమే నేరుగా వేతనాలు అందించేందుకు నూతన ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఇమామ్‌లు కోరుతున్నారు. గతంలో తెలుగుదేశం పాలనలో మౌజులకు రూ.3వేలు, ఇమామ్‌లకు రూ.5వేలు వేతనం ఉండగా దానిని జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం మౌజులకు రూ.5వేలు, ఇమామ్‌లకు రూ.10వేలకు పెంచారని గుర్తు చేస్తున్నారు. ఈ వేతనాలు నేరుగా మసీదు పెద్దలకు చెందిన ఖాతాల్లో జమవుతూ ఉంటాయి. ఈ సొమ్మును మసీదు పెద్దలు డ్రా చేసి వీరికి అందిస్తూ ఉంటారు. కానీ మసీదు పెద్దలు వీరికి అందించే వేతనాన్ని సకాలంలో, సక్రమంగా అందించకుండా వారి అవసరాలకు కొంత వినియోగించుకొని పూర్తిస్థాయి వేతనం ఇవ్వకుండా 50శాతం వేతనం మాత్రమే అందిస్తున్నారని మసీదుల్లో పనిచేసే మౌజు, ఇమామ్‌లు ఆరోపిస్తున్నారు. వైసీపీకి చెందిన ముస్లిం నాయకులు మత పెద్దలుగా ఉంటూ ప్రభుత్వం నుండి విడుదలయ్యే సొమ్మును పూర్తిస్థాయిలో వేతనాలు అందించకపోవటమే కాక ప్రభుత్వం ఇచ్చిన వేతనాన్ని తమకు జమ చేయాలని అడిగే వారిని బలవంతంగా, నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా మసీదులో పనిచేస్తున్న తమకు వేతనాన్ని పెంచిన ఆనందం అప్పటికి స్థానిక నాయకుల ప్రభావంతో లేకుండా పోయిందని చెబుతున్నారు. పెంచిన వేతనం పూర్తిగా చేతికి ఇవ్వకుండా సగమే ఇవ్వటం, అడిగితే మీ ఇష్టమైతే చేయండి లేకుంటే బయటికి వెళ్లిపోండి అంటూ నాయకులు హెచ్చరించారని వాపోతున్నారు. మండలంలోని భట్టిప్రోలు, అద్దేపల్లి గ్రామాల్లో నాలుగు మసీదులు, వేమవరం, పల్లికోన, వెల్లటూరు గ్రామాల్లో ఒక్కొక్క మసీదు చొప్పున మొత్తం ఏడు మసీదులు ఉన్నాయి. ప్రతి మసీదుకు ఇరువురు వ్యక్తులు ఇమామ్, మౌజులుగా పనిచేస్తుంటారు. వైసిపి పాలనలో వీరందరి పరిస్థితి అదే రీతిలో ఉందని చెబుతున్నారు. ప్రభుత్వం మూడు, నాలుగు నెలలకు ఒకసారి వేతనాలను మసీదు ఖాతాల్లో జమ చేయడంతో దానిని తమ ఖాతాలకు ఇవ్వాలని అడిగిన పాపనికి తనను పూర్తిగా తొలగించారని భట్టిప్రోలు గ్రామానికి చెందిన మౌజు ఇస్మాయిల్ బేగ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం మసీదుల్లో పనిచేసే మౌజు, ఇమామ్‌లకు అందించే వేతనం మసీదు ఎకౌంటుకు కాకుండా నేరుగా తమకే జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్కివారిపాలెంలో తాగునీటి ఇక్కట్లు



వివరాలు సేకరిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెద పులివరు పంచాయతీలోని అక్కివారిపాలెం గ్రామంలో భూగర్భ జలాలు మార్పు చెందాయి. ప్రజలకు త్రాగునీరు భారమైంది. గ్రామంలో కలుషితమైన భూగర్భ జలాలతో గత పది రోజులకుపైగా గ్రామస్తులు అతిసార వ్యాధికి గురై నాన అవస్థలు పడుతున్నారు. గత కొన్నిళ్ళుగా ఈ ప్రాంతంలో భూగర్భ జలాల్లో మార్పు రావడంతో త్రాగేందుకు వీలు లేకపోగా ఉన్న నీటిని వినియోగిస్తే పలు రకాల రోగాలకు గురికావాల్సి వస్తుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మేజర్ పంచాయతీగా ఉన్న పెదపులివరు పంచాయితీలో గ్రామానికి దూరంగా అక్కివారిపాలెం, పెద్దపాలెం, కోళ్లపాలెం వంటి దళితవాడలు ఉన్నాయి. ఈ గ్రామాల పరిధిలో భూగర్భ జలాలు అందుబాటులో ఉండటంతో ఎక్కడికి అక్కడ గ్రామాల్లో నేరుగా గ్రామస్తులకు నీరు చేరే విధంగా బోర్లు ద్వారా పంపులు ఏర్పాటు చేశారు. ఈ నీటిని ఎప్పటి నుండో ప్రజలు వినియోగించుకుంటున్నారు. కాగా ఏడాది పూర్తిగా నీరు కలుషితమై త్రాగితే అతిసార వ్యాధి సోకి వాంతులు, వీరేశనాలతో బాధపడుతున్నారు. ఇటీవల ఈ నీటిని సంబంధిత అధికారులు నమూనా తీసి ల్యాబ్‌కు పంపించారు. ఈపాటికే గత ఏడాది కాలంగా గ్రామస్తులు మారిపోయిన ఈ నీటిని వినియోగించు కోవటానికి పనికి రాకపోవడంతో బయట గ్రామాల నుండి వాటర్ ప్లాంట్ల ద్వారా నీటిని కొనుగోలు చేసుకుని త్రాగునీటి అవసరాలు తీర్చుకుంటున్నారు.

రోగాలు వెలుగు చూసేంత వరకు పట్టించుకోని పంచాయితీ

గ్రామంలో బోరు వసతి ఉన్న నీరు కలుషితమై త్రాగటానికి వీలు లేక ప్రజలు దూరప్రాంతాల నుండి త్రాగునీటినీ కొనుగోలు చేసుకుని తెచ్చుకుంటున్న అంశం పంచాయతీ అధికారులకు తెలిసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత పది రోజులుగా ఈ నీటిని తాగిన ప్రజలు అస్వస్థకు గురై అతిసార వ్యాధి బారిన పడ్డారు. వైద్య, ఆరోగ్య శాఖ అధి.కారులు వైద్య శిభిరం ఏర్పాటు చేశారు. అతిసారకు కారణాలు తెలుసుకునేందుకు నీటి వనరులను పరీక్షించారు. ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు నీటిని ల్యాబ్‌కు పరీక్ష కోసం పంపించారే తప్ప ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆగ్రహ వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాల ద్వారా విడుదలయ్యే నీటిలో వచ్చిన మార్పును పరిశీలించి గ్రామస్తులకు సరైన త్రాగునీరు అందే విధంగా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుచున్నారు.

ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కరిస్తా



ఎమ్మెల్యే కొండయ్యను పెన్షన్ అభ్యర్థిస్తున్న వృద్ధురాలు

ప్రజాశక్తి - వేటపాలెం

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత క్రమంలో కృషి చేస్తానని ఎంఎల్ఎ ఎంఎం కొండయ్య అన్నారు. స్థానిక సజ్జావారివీధిలోని టిడిపి సీనియర్ నాయకులు నాసిక వీరభద్రయ్య ఇంటికి ఆయన ఆదివారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత ప్రజలు ఆయనను కలిసి సమస్యలు ఏ కరువు పెట్టారు. వృద్ధులు పింఛన్లు ఇప్పించాలని కోరారు. కొంత మంది మహిళలు ఆ ప్రాంతంలో రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ ఎవరు అధైర్య పడాల్సిన అవసరం లేదని అన్నారు. గతంలో మాదిరిగా పాలన ఉండదని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కళ్ళకు సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. తన విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుత్తి పరమేశ్వరరావు, పిచ్చుక వెంకట సుబ్బారావు, గుత్తి హేమ సుందర్రావు, సజ్జ రమేష్, సజ్జా హరణబాబు, బొడ్డు ముసలయ్య, బొడ్డు శ్రీనివాసరావు, నాసిక వెంకటేశ్వర్లు, నాసిక కోటేశ్వరరావు, గుత్తి నాగభూషణం, ఉమామహేశ్వరరావు, పసుమర్తి రామారావు పాల్గొన్నారు.



అవార్డులు అందుకున్న బాపట్ల రోటరీ సభ్యులు

రోటరీ క్లబ్‌కు ఐదు అవార్డులు

ప్రజాశక్తి - బాపట్ల

రోటరీ క్లబ్‌కు ఐదు ప్రతిష్టాక అవార్డులు లభించాయని క్లబ్ కార్యదర్శి కోళ్లపూడి ఉపేంద్రగుప్త విలేకరులకు ఆదివారం తెలిపారు. భద్రాచలం ఏటపాక సీతారామ కన్వెన్షన్ హాల్లో శని, ఆదివారాల్లో జరిగిన రోటరీ డిస్ట్రిక్ట్ 3150 కాన్ఫరెన్స్ అవార్డు కార్యక్రమంలో బాపట్లకు అవార్డులు దక్కాయన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు రావూరి వీరరాఘవయ్య, మాజీ అధ్యక్షులు కొల్ల శ్రీనివాసరావు, ఎం సుధీర్ కుమార్ పాల్గొన్నారు.



సర్టిఫికెట్ పంపిణీ చేస్తున్న సబ్ ఇన్స్‌పెక్టర్ హరిబాబు

విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ

ప్రజాశక్తి - చీరాల

స్థానిక రోటరీ క్లబ్ నందు అబాకస్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు ఆదివారం సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఇ యేసయ్య మాట్లాడుతూ అబాకస్‌తో పిల్లల ఏకాగ్రతా, జ్ఞాపక శక్తి పెరుగుతుందని అన్నారు. పిల్లలు చదువుల్లో రాణించడానికి ఎంతో తోడ్పడుతుందని అన్నారు. సబ్ ఇన్స్‌పెక్టర్ హరిబాబు మాట్లాడుతూ పిల్లలకు చిన్న వయసులోనే క్రమశిక్షణతో కూడిన విద్యని అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. అబాకస్ నేర్చుకున్న పిల్లలు పెన్ పేపర్ లేకుండా అలవోకగా కూడికలు, తీసివేతలకు చెప్తున్న సమాధానాలను చూసి ముగ్ధుడనయ్యానని పిల్లల్ని ప్రశంసించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ సంస్థ 80కి పైగా దేశాల్లో ఉందని అన్నారు. మన రాష్ట్రంలో 80కి పైగా బ్రాంచిలు ఉన్నట్లు తెలిపారు. పద్మకుమారి మాట్లాడుతూ అబాకస్‌తో పిల్లల్లో నాడీవ్యవస్థ మెరుగ్గా పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో అబాకస్ సంస్థ డైరెక్టర్ బొనిగల రాజేంద్రప్రసాద్, స్మైలీ, విక్టోరియా, పద్మకుమారి పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో డాక్టర్ రాజ్ కుమార్

నాణ్యమైన వైద్యసేవలు అందిస్తాం

లత హాస్పిటల్ ఎండీ డాక్టర్ రాజ్ కుమార్

ప్రజాశక్తి - చీరాల

వైద్య వృత్తి ఎంతో విలువైనదని, అత్యవసర వైద్య సేవలకు దూరప్రాంతాలకు వెళ్లకుండా నాణ్యమైన వైద్య సేవలు ప్రజలకు అందించాలనే లక్ష్యంతో లతా హాస్పిటల్ ప్రారంభించినట్లు హాస్పిటల్ ఎండి డాక్టర్ రాజ్ కుమార్ అన్నారు. స్థానిక లత హాస్పిటల్‌లో ప్రాథమిక వైద్యుల అవగాహన సదస్సు డాక్టర్ తులసి రామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర వైద్య సేవలకు దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఆధునిక వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. అందరికీ అందుబాటులో ఉండేలా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. తమ హాస్పిటల్లో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. చీరాల, వేటపాలెం, ఇంకొల్లు పరిసర ప్రాంతాల ప్రాథమిక వైద్యులు అందరూ తమ హాస్పిటల్‌లో అందిస్తున్న వైద్య సేవలను ప్రజల దృష్టికి తీసుకువెళ్లి దూర ప్రాంతాలకు వెళ్లకుండా తమ హాస్పటల్లో అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం ప్రాథమిక చికిత్సకు అవసరమైన వైద్య పరికరాన్ని గ్రామీణ వైద్యులకు అందజేశారు. ఆత్మీయ సమావేశంలో చీరాల అసోసియేషన్ ప్రెసిడెంట్ సాంబశివ రావు, వేటపాలెం అసోసియేషన్ కె వరప్రసాద్, ఇంకొల్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'నరేంద్రవర్మ' శుభాకాంక్షలు

ప్రజాశక్తి - బాపట్ల




ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

సమతా, మమతల సమ్మిళితాన్ని చాటి చెప్పే బక్రీద్ పండుగ సందర్భంగా నియోజకవర్గ ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ శుభాకాంక్షలు తెలిపారు. శాంతి యుతంగా స్నేహభావంతో ఐకమత్యంగా పండుగ జరుపుకోవాలని కోరారు.

రాజీనామా చేసిన వాలంటీర్ల పరిస్థితేంటి?

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గత వైసిపి ప్రభుత్వంలో మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు వాలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారు. అయితే వాళ్ల పూర్తిగా వైసిపి కార్యకర్తలు కావడం, వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తున్నారనే అనేక ఆరోపణలు వచ్చాయి. గత ఎన్నికలకు ముందు వాలంటీర్ వ్యవస్థను ప్రభుత్వ మారితే రద్దు చేస్తారని ప్రచారం జోరుగా సాగింది. వాలంటీర్లు ప్రభుత్వ ఉద్యోగులు కాదని, వారిని ఎన్నికల విధుల్లోకి తీసుకోకూడదని, ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉన్నందున ఎన్నికలు పూర్తయ్యేవరకు వాళ్ల సేవలు నిలిపివేయాలని కోర్టు, ఎన్నికల కమిషన్ ఆదేశించింది. దీంతో వాలంటీర్లను తొలగించేందుకు తెలుగుదేశం పూనుకుందని దుష్ప్రచారాన్ని వైసిపి నేతలు చేశారు. వాలంటీర్లను టిడిపికి వ్యతిరేకంగా నిలిపే ప్రయత్నం చేశారు. వాలంటీర్ల ద్వారా ఓట్లు వేయించుకునేందుకు వైసిపి ప్రయత్నించింది. దీనిలో భాగంగా వాలంటీర్లలో వైసిపి నాయకులు బలవంతంగా రాజీనామా చేయించారు. అప్పటి వరకు సేవలు అందించిన వాలంటీర్లను ఎన్నికల రెండు నెలల పాటు తామే రూ.5వేల చొప్పున వేతనం అందిస్తామని నమ్మించి రాజీనామా చేయించారు. ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం భారీ మెజారిటీతో విజయం సాధించడంతో రాజీనామా చేసిన వాలంటీర్ల పరిస్థితి అగమ్య గోచారంగా మారింది. మండలంలో 266 మంది వాలంటీర్లు ఉండగా వారిలో 159మంది ఎన్నికల ముందు రాజీనామా చేసి వైసీపీకి అనుకూలంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. స్థానిక నాయకులు రెండు నెలలపాటు వేతనం అందిస్తామని చెప్పి బలవంతంగా రాజీనామా చేయించారు. ఒక నెల వేతనం మాత్రమే అందించారని, పైగా ఉన్న వాలంటీర్ పోస్టు కూడా పోవడంతో ఏమి చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నామని రాజీనామా చేసిన వాలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో మాజీ సీఎం జగన్ (ఫైల్ ఫోటో)

నాయకుల మాటల నమ్మి మోసపోయాం

ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు వాలంటీర్లను తొలగించే ప్రసక్తి లేదని, వేతనం కూడా రూ.10వేలు ఇస్తామని ప్రకటించినప్పటికీ స్థానిక వైసీపీ నాయకులు మాటలు నమ్మి ఉన్న వాలంటీర్ పదవిని కూడా ఊడ కొట్టుకున్నామని రాజీనామా చేసిన వాలంటీర్లు ఆగ్రహ వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మాత్రమే కాకుండా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వైసీపీ అభ్యర్థి వాలంటీర్లతో బలవంతంగా రాజీనామా చేయించారని ఆరోపిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తూ రూ.10వేలు వేతనం ఇస్తామని చెబుతుండటంతో రాజీనామా చేసిన వాలంటీర్ల పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ వాలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తే ప్రస్తుతం రాజీనామా చేయని వారిని కూడా కొనసాగిస్తారా లేక టిడిపికి చెందిన వారిని మరో మారు నోటిఫికేషన్ ద్వారా వాలంటీర్లుగా ఎంపిక చేస్తారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉపాధి చూపేందుకు కంకణం కట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుతం రాజనామా చేయకుండా పనిచేస్తున్న వారిని వాలంటీర్లుగా కొనసాగించాలని కోరుతున్నారు.

జల కాలుష్యాన్ని నివారించే తాబేళ్లను రక్షించుకోవాలి

ప్రజాశక్తి - బాపట్ల

జల కాలుష్యాన్ని నివారించి పర్యావరణ పరిరక్షణకు సముద్రపు తాబేళ్ళు ఎంతగానో దోహద పడతాయని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పిసి సాయి బాబు అన్నారు. తాబేళ్లపై ప్రజల్లో అవగాహన కలిగించిన పర్యావరణవేత్త ఆర్చికార్ జన్మదినం సందర్భంగా జూన్ 16న ప్రతి ఏటా నిర్వహించే సముద్ర తాబేళ్ల దినోత్సవం సందర్భంగా తాబేళ్ళ పరిరక్షణపై ఆయన విలేకరులతో మాట్లాడారు. సముద్రాల్లో ఆహార వలయాన్ని, ఆవరణ వ్యవస్థ స్థిరత్వాన్ని తాబేళ్ళు కాపాడతాయని అన్నారు. సముద్రం నుండి భూమికి అనేక పోషకాలను చేరవేస్తాయని తెలిపారు. సముద్ర గడ్డి ఎదుగుదలను నియంత్రిస్తాయని తెలిపారు. జెల్లీ చేపలను ఆహారంగా తీసుకొని వాటి సంతతిని తగ్గిస్తాయని అన్నారు. ఇలా తాబేళ్లు సముద్ర జీవులకు ఎంతో ఉపకారం చేస్తాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ఇంతగా ఉపయోగపడే తాబేళ్లను చేజేతులా నాశనం చేస్తున్నారని అన్నారు. సముద్ర జలాల్లో ప్లాస్టిక్ కాలుష్యం, మర పడవల వల్ల తాబేళ్ళు అంతరిస్తున్నాయని పేర్కొన్నారు. భూతాపం వల్ల తాబేలు గుడ్లు నాశనమవుతున్నాయని అన్నారు. రిడ్లే తాబేళ్ల జాతిని సంరక్షించేందుకు గతంలో అటవీ శాఖ అధికారులు సూర్యలంక తీరంలో తాబేలు గుడ్ల సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారని తెలిపారు. సముద్ర తీరంలో ఇసుక ఉన్న ప్రాంతాల్లో ఈ సముద్రపు తాబేళ్ళు రాత్రి వేళల్లో ఒడ్డుకు వచ్చి రెండు అడుగుల లోతు గుంట తీసి అందులో 80 నుండి 100 వరకు గుడ్లు పెట్టి తిరిగి అవి పొదిగి పిల్లలుగా బయటకు వచ్చే విధంగా అవసరమైన మేర ఇసుకను కప్పి తిరిగి సముద్రంలోకి వెళతాయని తెలిపారు. అటవీ అధికారులు తీరంలో సంచరించి తాబేలు పాదాల గుర్తులను గుర్తించి గుడ్లు పెట్టిన ప్రదేశాల్లో తాబేలు గుడ్లను సేకరించి తాబేలు సంరక్షణ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక గుంటల్లో గుడ్లను 40రోజులపాటు పొదిగించి తాబేలు పిల్లలను సముద్రంలోకి వదిలే ఏర్పాటు చేశారని తెలిపారు. రాను రాను అటవీ శాఖ అధికారులు తాబేలు సంరక్షణ కేంద్రాల నిర్వహణను వదిలేసారని ఆరోపించారు. అనంతరం కొంతకాలం పాటు సూర్యలంకలో శివాలయం నిర్మాణం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న దశరథ మహారాజు తాబేలు సంరక్షణ కేంద్రాలను పరిరక్షించారని తెలిపారు. తాబేలు పెట్టిన గుడ్లను తీరంలో సంచరించే ప్రజలు నాశనం చేయడంతో తాబేలు గుడ్ల సేకరణను వదిలేశారని అన్నారు. అంతరించిపోతున్న సముద్రపు తాబేళ్లను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు.



సముద్రంలోకి వదులుతున్న రిడ్లే తాబేళ్ళు (ఫైల్‌ఫోటో)



ఎమ్మెల్యే కొండయ్యను సత్కరిస్తున్న మహిళలు

ఎమ్మెల్యే కొండయ్యకు సత్కారం

ప్రజాశక్తి - చీరాల

శాసన సభ్యునిగా విజయం సాధించిన ఎంఎం కొండయ్యను తోటవారిపాలెం, బచ్చులవారిపాలెం గ్రామాల మహిళలు, ప్రజలు పూలదండలతో ఘనంగా ఆదివారం సత్కరించారు. ఎన్నికల్లో విజయం సాధించిన నేపథ్యంలో ఎమ్మెల్యే కొండయ్య తోటవారిపాలెం పోలేరమ్మ గుడి, బచ్చులవారిపాలెం పోలేరమ్మ గుడిని సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రజలు ఆయనను కలసి పూలదండలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. తన గెలుపుకు సహకరించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నిత్యం ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని అన్నారు. అనంతరం గ్రామ అభివృద్ధిపై ప్రజలతో కొద్దిసేపు చర్చించారు. ఆయన వెంట తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - బట్టిప్రోలు

రాష్ట్రంలో కౌలు రైతులకు ప్రభుత్వం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు గొట్టుముక్కల బాలాజీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ రంగంలో అధిక శాతం కౌలు రైతులే వ్యవసాయ ఉత్పత్తులను సాధిస్తున్నారని అన్నారు. అలాంటి వారికి రైతులతో సంబంధం లేకుండా ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి తద్వారా గుర్తింపు కార్డులు, రుణాలు, ప్రభుత్వ రాయితీలు, వ్యవసాయ పరికరాలు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. రాష్ట్రంలో కౌలు రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చించేందుకు విజయవాడలోని సిపిఐ కార్యాలయంలో ఈ నెల 17న సదస్సు జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సుకు వేమూరు, రేపల్లె నియోజకవర్గాల కౌలు రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ సదస్సుకు కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి జమలయ్య, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి ఈశ్వరయ్య, కెవివి ప్రసాద్ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో సిపిఐ నాయకులు బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ నాయకులు జి బాలాజీ

చోరీ కేసుల్లో ఐదుగురు ముద్దాయిల అరెస్టు

ప్రజాశక్తి - అద్దంకి

ఇటీవల పట్టణ, గ్రామీణ ప్రాంతంలో అనేక దొంగతనాలు జరిగిన ఘటనలో ఐదుగురు ముద్దాయిలను స్థానిక భవాని సెంటర్లో సీఐ కృష్ణయ్య అరెస్టు చేశారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వద్ద రూ.4.20లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముద్దాయిలు వడిసిన వేణుగోపాల్‌రెడ్డి, షేక్ తరుణ్, నూతలపాటి రాధాకృష్ణ, చింతలపూడి శివప్రసాద్, చింతలపూడి నరసింహారావుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరంత ప్రకాశం జిల్లా చెందిన వారిని సిఐ తెలిపారు. చోరీ ఘటనల్లో సమాచారం తెలిస్తే పోలీసులకు చెప్పాలని కోరారు.



దివ్యాంగుల సంఘం అధ్యక్షులు టి మురళీకృష్ణ

పెన్షన్ పెంపు పట్ల హర్షం

ప్రజాశక్తి - రేపల్లె

దివ్యాంగుల పెన్షన్ రూ.3వేల నుండి రూ.6వేలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెంచిన సందర్భంగా అరుణ శ్రీ దివ్యాంగుల సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రెసిడెంట్ టీ మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్నం రెండు గంటలకు తాలూకా కార్యాలయం నుండి తెలుగుదేశం కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జనసేనాని కొణిదెల పవన్ కళ్యాణ్, రెవెన్యూ శాఖ మంత్రి అనగానీ సత్యప్రసాద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గం పరిసర ప్రాంత దివ్యాంగులు పాల్గొనాలని కోరారు.



మృతదేహానికి నివాళులర్పిస్తున్న వరికూటి తేజస్

వైసీపీ నాయకురాలు పుష్పలత మృతి

ప్రజాశక్తి - వేమూరు

అమృతలూరు మండలం మూల్పూరు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు కూచిపూడి వీరయ్య తల్లి పుష్పలమ్మ ఆదివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న వైసిపి కన్వీనర్ వరికుటి అశోక్ బాబు తనయుడు తేజస్ ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆ కుటుంబానికి వైసిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబానికి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మండల, గ్రామ వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రమాదంలో కాలిపోయిన గడ్డి వామి, పశువుల చావిడి

బోరా మాదిగ పల్లెలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - నగరం

మండలంలోని బెల్లవారిపాలెం గ్రామంలోని బోరా మాదిగపల్లిలో పసుపులేటి కోటేశ్వరరావుకు చెందిన పది ఎకరాల గడ్డివామి, పశువుల చావిడి అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదంలో గొడ్ల చావిడిలో ఉన్న రెండు పాడి గేదెలు, రెండు దూడలు పూర్తిగా కాలి మృతి చెందాయి. ప్రమాదవశాత్తు జరిగిన ఘటనలో రూ.5లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు పేర్కొన్నారు. ఘటన సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులో తీసుకొచ్చారు. పశువులు కాలి చనిపోవడం గ్రామస్థులను కలచివేసింది.


వల్లూరమ్మ దేవస్థానంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి స్వామి

మంత్రి స్వామికి అడుగడుగునా స్వాగతం

ప్రజాశక్తి-శింగరాయకొండ, టంగుటూరు

జిల్లాలో ఇసుక మాఫియాను అరికడతామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. మంత్రి స్వామి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆదివారం తొలి సారిగా జిల్లాకు వచ్చారు. బొప్పూడి ఆంజనేయ స్వామి దేవస్థానంలో మంత్రి స్వామి, దామచర్ల సత్య, దామచర్ల పూర్ణచంద్రరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వల్లూరమ్మ దేవస్థానంలో వేద పండితులు పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికి.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి స్వామి మాట్లాడుతూ వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసి ప్రజలకు అందించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇసుక మాఫియాను అరికట్టనున్నట్లు తెలిపారు. వీరి వెంట జోన్-1 ఇన్‌ఛార్జి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, దామచర్ల పూర్ణచంద్రరావు, టంగుటూరు మాజీ ఎంపిపి చదలవాడ చంద్రశేఖర్, మాజీ సర్పంచి బెల్లం జయంతిబాబు, టంగుటూరు టిడిపి అధ్యక్షులు కామని విజయ్‌కుమార్, జరుగుమల్లి టిడిపి అధ్యక్షులు పోకూరి రవీంద్రబాబు, చదలవాడ బ్రహ్మేంద్రం, బత్తిన బ్రహ్మయ్య పాల్గొన్నారు.

గ్రోత్ సెంటర్ వద్ద మంత్రికి స్వాగతం

మద్దిపాడు: మండల పరిధిలోని గ్రోత్ సెంటర్ వద్ద టిడిపి మండల అధ్యక్షులు మండవ జయంత్‌బాబు ఆధ్వర్యంలో మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామికి, టిడిపి ఇన్‌ఛార్జి దామచర్ల సత్యకు గజమాలతో ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తుమ్మల సుధాకర్, పోకూరి శ్రీనివాసరావు, తుమ్మల హరిబాబు, ప్రధాన కార్యదర్శి ముత్తనపల్లి రామలింగయ్య, క్లస్టర్ ఇన్‌ఛార్జి దేవభక్తుని ప్రసాదరావు, పాటిబండ్ల అజయ్ కుమార్ పాల్గొన్నారు.

బక్రీద్ పర్వదినాన్ని

ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి..

అదనపు ఎస్‌పి (అడ్మిన్) కె.నాగేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దేవునిపై విశ్వాసాన్ని కలిగి సన్మార్గంలో జీవనం సాగించాలనే గొప్ప సందేశాన్ని మానవాళికి చూపుతూ, ఇతరులకు పంచిపెట్టే దాతత స్ఫూర్తిని కలిగిస్తూ త్యాగానికి, సత్యానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండగను ముస్లిం సోదరులు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా అదనపు ఎస్‌పి కె.నాగేశ్వరరావు సూచించారు. జిల్లా ఎస్‌పి గరుడ్ సుమిత్ సునీల్ ఆదేశాల మేరకు బక్రీద్ పండుగ వేడుకలు, కార్యక్రమాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిందన్నారు. ముందస్తు భద్రత చర్యల్లో అన్ని మత పెద్దలతో, శాంతి కమిటీ సభ్యులతో పోలీసు అధికారులు సమావేశం నిర్వహించి ప్రార్ధనలు, ఇతర కార్యక్రమాలు సమయాలలో ఎలాంటి సంఘటనలు, సమస్యలు లేకుండా సుఖ శాంతులతో జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో గోవధ నిషేధ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేస్తున్నట్లు, గోవుల అక్రమ తరలింపును అడ్డుకునేందుకు జిల్లాలో 18 చెక్ పోస్టులు, మండల కేంద్రాల్లో మొబైల్ టీమ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. అక్రమ రవాణాకు గురైన గోవులకు షెల్టర్‌కు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పశు సంవర్ధక శాఖను కోరామన్నారు. షెల్టర్ ప్రదేశాలలో 24 గంటలు వెటర్నరీ డాక్టర్లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ఎవరైనా అక్రమంగా గోవులను తరలించినా, గోవధకు పాల్పడినా వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఏఎస్‌పి హెచ్చరించారు. ప్రభుత్వం గోవధను నిషేధించిందని, గో సంరక్షణ చట్టం ప్రకారము గోవులను వధించడం చట్టరీత్య నేరమన్నారు. గోవులను ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశంకు తరలిస్తున్న సందర్భాలలో తగిన పత్రాలను ఉంచుకోవాలన్నారు. శాంతి భద్రతల సమస్యలు, మత సంఘర్షణలు తలెత్తేలా ఎవరూ ప్రవర్తించరాదన్నారు. సోషల్ మీడియాలో మత విద్వేషాలు, సంఘర్షణలు రేకెత్తించే పోస్టులు పెట్టరాదని, షేర్ చేయరాదని సూచించారు. మత ఘర్షణలను ప్రేరేపించే పుకార్లను నమ్మవద్దని, పోహలు, వదంతులను నమ్మి చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేయరాదన్నారు. అందరు మత సామరస్య భావనతో శాంతియుతంగా మెలగాలన్నారు.


మాట్లాడుతున్న ఏఎస్పీ కె.నాగేశ్వరరావు

శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

బాపట్ల జిల్లా: అన్ని మతాలూ ఒక్కటేనని, ఒకరి మనోభావాలను మరొకరు గౌరవించుకుంటూ, శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా ప్రభుత్వం సూచించిన నియమ నిబంధనలను పాటిస్తూ ప్రశాంతమైన శాంతియుత వాతావరణంలో సంతోషంగా బక్రీద్ పండుగను జరుపుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ముస్లిం సోదరులను కోరారు. జిల్లాలోని ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా ఎస్పీ సర్వమత సమ్మేళనమైన భారత దేశంలో ఒకరి మనోభావాలను మరొకరు గౌరవించుకోవాలన్నారు. సోమవారం ముస్లిం సోదరులు జరుపుకొనే బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ సూచించారు, సర్వ మత సమ్మేళనమైన భారతదేశంలో అన్ని మతాల ఆచారాలను, సంప్రదాయాలను గౌరవించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని ఈద్గాలు, మసీదుల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పగడ్బందీగా ఏర్పాట్లు చేశామని చెప్పారు. సోషల్‌మీడియాపై నిఘా ఉంచడమైందన్నారు. ఆకతాయి చేష్టలతో సోషల్ మీడియాలో వదంతులను ఉద్దేశపూర్వకంగా సృష్టిస్తే వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు.

సైబర్ నేరాల పట్ల జాగ్రత్త..

- సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆశను అస్త్రంగా ఎంచుకుంటున్న సైబర్ నేరగాళ్లు
- పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- ఎస్పీ వకుల్‌జిందాల్


ఎస్పీ వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వకుల్‌జిందాల్ సూచించారు. ఇటీవల కాలంలో వెలుగుచూస్తున్న కొత్త రకమైన సైబర్ నేరాల గురించి వివరించారు. ప్రస్తుతం ఉన్న యాంత్రిక జీవన సమాజంలో సులభంగా డబ్బులు ఎలా సంపాదించాలని అధికశాతం ప్రజలు ఆలోచిస్తున్నారని చెప్పారు. నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగాలు చేస్తూ వచ్చే జీతాలు సరిపోక పార్ట్ టైం జాబ్స్ కోసం అధిక శాతం మంది ఆన్‌లైన్‌లో సెర్చింగ్ చేస్తూ ఉంటారని, ఇంట్లో ఉండే మహిళలు కూడా ఖాళీగా ఉండే సమయంలో పార్ట్ టైం జాబ్ చేస్తే బాగుంటుందని వీరు కూడా ఆన్ లైన్లో జాబ్స్ కోసం సెర్చింగ్ చేస్తూ ఉంటారని, వారి వివరాలను అనేక రకాలైన వెబ్సైట్లలో పొందుపరుస్తున్నారని తెలిపారు. ఆ వివరాలను సైబర్ నేరగాళ్ల తస్కరించి.. మోసాలకు పాల్పడుతున్నారని, స్మార్ట్ ఫోన్, డిజిటల్ లావాదేవీలు పెరిగిపోవడంతో అదే స్థాయిలో ఆన్లైన్లో మోసాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు.

సైబర్ నేరగాళ్ల వాట్సప్ నెంబర్లకు పార్ట్ టైం జాబ్ అని సందేశాన్ని పంపుతారని, ఆ సందేశానికి జవాబు ఇవ్వగానే ఒక లింక్ వస్తుందని, దానిని క్లిక్ చెయ్యగానే ఒక టెలిగ్రామ్ గ్రూప్‌లో జాయిన్ అవుతారని, ఆ గ్రూప్‌లో వివిధ రకాల తేలికైన టాస్కులు ఇస్తారని ఉదాహరణకు ఏదైనా వస్తువును స్క్రీన్ షాట్ తియ్యమని, లైక్ చెయ్యమని చెబుతారన్నారు. ఆ స్క్రీన్ షాట్ షేర్ చేస్తే టాస్క్ కంప్లీట్ అయ్యినట్లు, టాస్క్ ఆడిన తరువాత చిన్న మొత్తంలో సొమ్ము గెలిచినట్లు ఖాతాలో జమ చేస్తారని, ఎటువంటి పెట్టుబడి పెట్టకుండా డబ్బులు వచ్చాయని భావిస్తారన్నారు. తరువాత తక్కువ మొత్తంలో పెట్టుబడి పెడితే ఎక్కువ మొత్తంలో డబ్బులు వస్తాయని ఆశ గొల్పుతారని, దశల వారీగా టాస్కులు నిర్వహించి పెట్టుబడి మొత్తాన్ని పెంచుతారని, టాస్క్ గెలిచిన సొమ్మును ఫేక్ వెబ్సైట్ లో చూపిస్తారని, గెలిచిన సొమ్ముని రిసెప్షనిస్ట్ అనే వ్యక్తికి పంపి డబ్బులు మీ బ్యాంకు అకౌంట్‌లో జమ చేస్తారని తెలుపుతారని అన్నారు. ఎక్కువ మొత్తంలో పెట్టుబడి పెడితే మరింత ఎక్కువ మొత్తంలో డబ్బులు వస్తాయని ఆశ గొల్పుతారని, రకరకాల కారణాలు చూపించి వేలు, లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టిస్తారని, డబ్బులు గెలిచినట్లుగా వాళ్ళ ఫేక్ వెబ్‌సైట్‌లో చూపిస్తారని, కానీ అవి నిజమైన డబ్బులు కావని, ఆ డబ్బులు మీ బ్యాంకు అకౌంట్‌లో జమ కావని చెప్పారు. దానికి వారు వివిధ కారణాలు చూపి మీకు ఆశ కల్పించి మరింత డబ్బు వారి అకౌంట్ లో జమ చేయించుకుంటారని అన్నారు. తీరా బాధితులు మోసపోయామని గుర్తించే సరికి జరగవలసిన నష్టం జరిగిపోతుందని ఎస్పీ తెలిపారు.

జాగ్రత్తలివీ..

కంపెనీ, ఉద్యోగ అవకాశాలను పూర్తిగా పరిశోధించండి, వారి వెబ్‌సైట్, కంపెనీ చట్టబద్ధతను ధ్రువీకరించండి. ఇతర ఉద్యోగులు నుండి సలహాలు, అభిప్రాయాలు సేకరించుకోండి. వ్యక్తిగత సమాచారం జాగ్రత్తగా ఉంచుకోండి, ఉద్యోగ అవకాశం, గ్రహీత యొక్క చట్టబద్ధత గురించిన సమాచారం మీకు ఖచ్చితంగా తెలియకపోతే, బ్యాంక్ ఖాతా నంబర్‌లు, ఆధార్ కార్డ్, ఫోన్ నంబర్‌లు, ఇతర గుర్తింపు పత్రాలు వంటి సున్నితమైన వ్యక్తిగత వివరాలను పంచుకోవద్దు. సంస్థలు జీతాలు ఇచ్చి నియమించుకుంటాయి, కానీ డబ్బులు తీసుకొని ఉద్యోగాలు ఇయ్యవు అనే విషయాన్ని గుర్తించాలి. పార్ట్‌టైమ్ ఉద్యోగ అవకాశాల కోసం శోధిస్తున్నప్పుడు ప్రసిద్ధ జాబ్ పోర్టల్‌లు లేదా వెబ్‌సైట్‌లకు కట్టుబడి ఉండండి. అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చెయ్యకండి. చిన్న చిన్న కారణాలకు ఎక్కువ డబ్బులు లేదా ఉచితంగా డబ్బులు ఇస్తున్నారు అంటే ఆ సైట్లు వల్ల రాబోయే రోజులలో తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని ముందుగానే గ్రహించాలి. ఇలాంటి పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి లేదా సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు కాల్ చెయ్యాలని లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ తెలిపారు.

18న ఒంగోలులో రక్తదాన శిబిరం


మాట్లాడుతున్న కాలం సుబ్బారావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రపంచ రక్తదాన దినోత్సవాల సందర్భంగా ఒంగోలు రెడ్‌క్రాస్ భవనంలో సిఐటియు, ఏపియంయస్ఆర్‌యు ప్రకాశం జిల్లా కమిటీ ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఈనెల 18న జరుగుతుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు తెలిపారు. కార్యక్రమ కర పత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. రక్తదాన శిబిరాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ ప్రారంభిస్తారని, ముఖ్య అతిథులుగా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ యం జస్వంత్ రావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, ఒంగోలు బెతూన్ నర్సింగ్ హెూం డాక్టర్ ఎన్.ఉదయిని, శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ చాపల వంశీకష్ణ, శ్రీ రాఘవేంద్ర శ్రీనివాస హాస్పిటల్ డాక్టర్ శ్రీనివాసరావు అనపర్తి పాల్గొంటారన్నారు. కార్యక్రమం లో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యం రమేష్ ,సిఐటియు, ఒంగోలు నగర కార్యదర్శి టి మహేష్, ఏపియంయస్ ఆర్‌యు జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, ప్రధాన కార్యదర్శి ఐకె కష్ణమోహన్ పాల్గొన్నారు.